క్లుప్తంగా

ప్రత్యేక పూజల్లో మంత్రి మనోహర్



తెనాలిరూరల్: పట్టణ వైకుంఠపురంలోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరిగిన శిఖర ప్రతిష్ఠామహోత్సవాల్లో రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం పాల్గొన్నారు. ఆలయ అధికారులు, వేదపండితులు స్వాగతం పలికారు. ఆలయ శిఖరంపై కలశాలకు పూజలు చేసి ఆలయ మండపంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

రచయిత కాశీభట్ల వేణుగోపాల్‌కు ఘన నివాళి

లక్ష్మీపురం: రచయిత కాశీభట్ల వేణుగోపాల్ మృతి సాహితీ లోకాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం సంతాప సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొదటి నవల 'నేను – చీకటి' నుండి చివరి నవల అసంగతం వరకూ మానవుడి మనస్తత్వాన్ని నగ్నంగా ఎత్తిచూపటమే సాహిత్య లక్ష్యంగా తన రచనలను కొనసాగించాడని తెలిపారు.

పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలు

మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని పేద, సామాన్య వర్గాల ప్రజలు రోజువారీ నిత్యావసరాలు కొనుగోలు చేయలేక ఆర్థికంగా చితికిపోతున్నారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం నిత్యావసరాల ధరలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి



తెనాలిఅర్బన్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని 22వ ఆంధ్రా బెటాలియన్ అధికారి దీపక్ రాజ్‌పుత్ పేర్కొన్నారు. మారీసుపేటలోని ఎన్‌సీఆర్ఎస్ఎం హెచ్ స్కూల్‌లో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే తరాలకు మంచి వాతవరణం అందించాలనే ఉద్దేశంతో ప్రధాన మంత్రి ఏక్ పేడ్–మాకే నామ్ పర్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. అధికారి అక్యుజం చోబా, హెచ్ఎం పీవీ సుధారాణి, ఉపాధ్యాయులు నాగిరెడ్డి, ప్రసాదరెడ్డి, ఎన్‌సీసీ అధికారి స్వామి, సీఆర్ఎంటీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మంగళగిరి: మాజీ సైనిక ఉద్యోగులకు అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ సైనికుల ఉద్యోగుల వెల్ఫేర్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు శంకరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక నిడమర్రు రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో ప్రతినిధులు పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు గుణశీల, కృష్ణారెడ్డి, సాంబశివరావు, రవిబాబు, షేక్ అమన్, రాకేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి

వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రకాష్

తాడేపల్లిరూరల్: ఆరోగ్యశ్రీ ప్రదాత, పేదల పెన్నిధి, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్ర ప్రజల కోసం 108 సేవలు, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. సెప్టెంబర్ 2వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టి.వికాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వాలు సీరియస్‌గా స్పందించాలి



కోల్‌కత్తాలో వైద్య విద్యార్థిని హత్య దారుణం. సభ్యసమాజం తలదించుకునే ఘటన. వైద్య వృతిలో అందరి ప్రాణాలు కాపాడాలని ఆకాంక్షించే వైద్యులకే రక్షణ లేకపోతే ఎలా.. ప్రస్తుత చట్టాలు ఇలాంటి దాడుల నుంచి కాపాడడంలో విఫలమవుతున్నాయి. ఆ ఘటనతో వైద్య లోకం నివ్వెరపోయింది. ఒకరకమైన భయం ఏర్పడింది. సేవలు అందించేందుకు కూడా భయపడుతున్నారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వాలు సీరియస్‌గా స్పందించాలి. అవసరమైన చట్టాలు తీసుకురావాలి.

– సి.యానీగ్రేస్, వైద్యురాలు, నుదురుపాడు పీహెచ్‌సీ



కఠిన చర్యలు తీసుకోవాలి



వైద్యులపై దాడి చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. ఇటువంటి ఘటనలు పునారావృతం కాకుండా తగిన భద్రత పరమైన అంశాలపై దృష్టి పెట్టాలి. వైద్యశాలల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ప్రస్తుతం పట్టణాల్లో ఉన్న ఆస్పత్రుల వద్ద మాత్రమే కొద్దిపాటి భద్రత చర్యలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అసలే లేదు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి తగిన భద్రత ఏర్పాట్లు చేయాలి. ఇప్పటి కోల్‌కతా ఘటనతో మానసిక ఆందోళన మొదలైంది. తగిన రక్షణ చర్యలు తీసుకోవాలి.

– ఫరీనాబేగం, వైద్యురాలు, నుదురుపాడు

ఈ పనుల మాటేమిటి!



గత నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షానికి ఇంటిలోకి వచ్చిన మురుగునీటిని బయటకు తోడుకుంటున్న మహిళ

- పనులవైపు చూడని ప్రజా ప్రతినిధులు
- ఆందోళనలో ప్రజలు

నెహ్రూనగర్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరు నగరంలో అభివృద్ధి పనులు వేగంగా సాగాయనే చెప్పుకోవాలి. నగరంలో ఎక్కడ చూసిన సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించి ప్రజల కష్టాల తీర్చారు. అయితే గత సార్వత్రిక ఎన్నికలక ముందు గుంటూరు నగరంలో సుమారు వంద కోట్లు పనులు ప్రారంభవ్వాల్సి ఉండగా ఎన్నికల కోడ్ కారణంగా ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి మూడు నెలల్లో పనులు మందగించాయి.

మురుగు కాలువలు..

గుంటూరు పట్టాభిపురం నాలుగోలైన్ గత కొద్ది నెలల క్రితం వైఎస్సార్ సీపీ పాలనలో సీసీ రోడ్డు వేశారు. సీసీ డ్రైన్ వేసే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. అయితే సదరు ప్రాంతంలో సీసీ డ్రైన్ లేకపోవడంతో ఇంటి ముందు గుంతలు ఏర్పాటు చేసుకుని దాని ద్వారా మురుగునీరు బయటికి పంపించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. నాలుగు రోజుల క్రితం గుంటూరు నగరంలో కురిసిన భారీ వర్షానికి సదరు ప్రాంతంలో కాలువలు లేకపోవడంతో ఇళ్లల్లోకి వర్షం నీరు చేరడంతో సదరు ప్రాంతంలో ప్రజలు ఇంటిలోని వర్షం నీరు బయటకు పోసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంకుడు గుంతలు వలన దోమలు వృద్ధి చెంది అనారోగ్య పాలవుతున్నమని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు సదరు ప్రాంతంలో కాలువలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



పట్టాభిపురం 4వ లైనులో గుంతలో నిలిచిన మురుగునీరు



సీసీ రోడ్డు వేశారు... సీసీ డ్రైయిన్ వేయని దృశ్యం

కాలువలు నిర్మించాలి



మా ప్రాంతంలో గత కొద్ది నెలల క్రితం సీసీ రోడ్డు వేశారు. కాని సీసీ డ్రెయిన్ వేయలేదు. దీంతో మా ప్రాంతంలో ఇంకుడు గుంతలు చేసుకుని ఇంటిలో వాడుకున్న నీటిని బయటకు పంపించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి మా ప్రాంతంలో కాలువలు నిర్మించాలి.

– కామేశ్వరరావు, పట్టాభిపురం 4వ లైను

వర్షం పడితే ఇళ్లలోకి వర్షం నీరు



నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి మా ప్రాంతం అంతా నీటి మునిగిపోయింది. ఇళ్లల్లోకి మురుగునీరు చేరింది. చేసేదేమి లేక మురుగునీటిలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం నీటిని బయటకు తోడుకున్నాం. మా సమస్యకు పరిష్కారం చూపాలి.

– కమలమ్మ, పట్టాభిపురం 4వ లైను

జెడ్పీ నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తాం

జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



హెనీ క్రిస్టినా జన్మదిన వేడుకలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ నూతన భవన నిర్మాణాన్ని చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. బుధవారం హెనీ క్రిస్టినా జన్మదినం సందర్భంగా జెడ్పీ సమావేశ మందిరంలో ఉద్యోగులు ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. ఆమె మాట్లాడుతూ జెడ్పీ చైర్‌పర్సన్‌గా రెండున్నరేళ్లలో ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కిందని అన్నారు. జెడ్పీ పరిపాలనలో ఉద్యోగులు అందిస్తున్న సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హెనీ క్రిస్టినాకు జెడ్పీ సీఈవో ఎస్ఎస్వీబీ వసంత రాయుడు, డెప్యూటీ సీఈవో జె.మోహనరావు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి, కాకుమాను, వట్టిచెరుకూరు జెడ్పీటీసీలు గుల్జార్ బేగం, వెంకటలక్ష్మి, ఏఓ శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగ సంఘ నాయకులు కూచిపూడి మోహన్, పూర్ణచంద్రారెడ్డి, సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు ప్రత్యేక జోన్‌లు ఏర్పాటు

నెహ్రూ నగర్: గుంటూరు నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా వీధి వ్యాపారులకు ప్రత్యేక జోన్‌ల ఏర్పాటుకు అనువైన స్థలాల గుర్తింపునకు నగరపాలక సంస్థ, అదనపు కమిషనర్, సిటీ ప్లానర్, సూపరింటెండెంట్ ఇంజినీర్ల ఆధ్వర్యంలో 3 కమిటీలను ఏర్పాటు చేశామని, వీధి వ్యాపారులు కూడా ఆయా జోన్లకు వెళ్లడానికి సమాయత్తం కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నగరంలో పెరుగుతున్న జనాభా, వాహనాల ట్రాఫిక్ పెరుగుతుందని, ప్రధాన రహదారులను విస్తరించినప్పటికీ వీధి వ్యాపారుల ఆక్రమణల వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్ మార్జిన్ లు, ఫుట్ పాత్ ల ఆక్రమణలకు గురి అయి, వాహనాల రాకపోకలకు, అత్యవసర పరిస్థితులలోని వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి వస్తుందన్నారు. నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య సిబ్బంది పలుమార్లు ఆక్రమణదార్లకు సమస్యపై తెలియచేసినప్పటికీ ఏ విధమైన సహకారం లేకుండా యధావిధిగా ఆక్రమణలు చేస్తున్నారని చెప్పారు. సమస్య శాశ్వత పరిష్కారం కోసం స్ట్రీట్ వెండింగ్ పాలసీ అమలుకు నగరంలో రెడ్, అంబర్, గ్రీన్ జోన్ల ఏర్పాటుకు తగిన స్థలాలను గుర్తించడానికి నగరపాలక సంస్థ సీనియర్ అధికారులతో కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. జోన్ల ఏర్పాటుకు ముందు వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డ్ లు అందిస్తామని, ఆయా జోన్లలోనే క్రయ విక్రయాలు చేసుకునేలా వీధి వ్యాపారులు సహకరించాలని కోరారు. జోన్ల ఏర్పాటు అయ్యేవరకు నగరంలో ప్రధాన రోడ్లపై ట్రాఫిక్ కు అడ్డుగా ఉన్న వీధి వ్యాపారులకు ముందుగా తెలిపి, రోడ్ మార్జిన్ అతిక్రమించకుండా చూడాలని, వీధి వ్యాపారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. జీఎంసీ సిబ్బంది వీధి వ్యాపారుల పట్ల అనుచితంగా ప్రవర్తించినట్లు తమ దష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. వీధి వ్యాపారులు కూడా నగరపాలక సంస్థ సిబ్బందికి సహకరించి నిబంధనలు పాటిస్తూ, వారి కార్యకలాపాలు నిర్వహించుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో సమస్య ఉత్పన్నమైన ఎడల నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. జోన్ల ఏర్పాటు అయిన పిదప నిర్దేశిత ప్రాంతాలకు తరలి వెళ్లేందుకు సమయత్తం కావాలన్నారు.

పీఎంశ్రీ పాఠశాలల అభివృద్ధి పనులు పర్యవేక్షించాలి

జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ శైలజ, వేదికపై సమగ్రశిక్ష ఏపీసీ విజయలక్ష్మి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలో ప్రధానమంత్రి రైజింగ్ ఇండియా పాఠశాలలు(పీఎం శ్రీ) పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ పేర్కొన్నారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని జిల్లా పరీక్ష భవన్‌లో బుధవారం గుంటూరు జిల్లాలో పీఎం శ్రీ కింద ఎంపికైన 25 ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. డీఈఓ శైలజ మాట్లాడుతూ పీఎం శ్రీ పాఠశాలల్లో ఆధునిక బోధన వసతులతో పాటు సైన్స్ ల్యాబ్స్, ప్లే గ్రౌండ్లను అభివృద్ధి పర్చేందుకు మొత్తంగా ఏడు కాంపొనెంట్ల వారీగా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని చెప్పారు. ఏడు పాఠశాలల పరిధిలో ప్రతి పాఠశాలలో రూ.ఐదు లక్షలు చొప్పున మంజూరైన నిధులతో కెమిస్ట్రీ ల్యాబ్‌ల నిర్మాణం జరుగుతుండగా, 17 పాఠశాలల పరిధిలో ప్లే గ్రౌండ్లను అభివృద్ధి పర్చేందుకు రూ.లక్ష చొప్పున నిధులు మంజూరైనట్లు వివరించారు. పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు నిరంతరం పర్యవేక్షిస్తుండాలని, ఆయా పాఠశాలల్లో కొత్తగా ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీ(పీఎంసీ) చైర్మన్లు పనులకు సంబంధించిన నాణ్యతా ప్రమాణాలను పరిశీలించాలని కోరారు. ఆయా పాఠశాలల అభివృద్ధిలో సర్పంచులు, ఎస్ఎంసీల చైర్మన్లు, సభ్యులు పూర్తిస్థాయిలో భాగస్వాములు కావాలని సూచించారు. పీఎం శ్రీ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ఎంఈఓ–2లు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని చెప్పారు. సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలల్లో అభివృద్ధి పనుల కోసం ఇప్పటి వరకు మంజూరైన నిధుల గురించి వివరించారు. సమావేశంలో గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు, ఎంఈఓలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామ సర్పంచులు, ఎస్ఎంసీ చైర్మన్లు, డీసీఈబీ కార్యదర్శి ఎ.తిరుమలేష్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం పాల్గొన్నారు.

తాగునీటి శుద్ధి కేంద్రం ప్రారంభం



నగరంపాలెం: స్థానిక ఎస్‌వీఎస్ కాలనీపార్కులో నూతనంగా ఏర్పాటుచేసిన తాగునీటి కేంద్రం, వెయిటింగ్ రైన్ షల్టర్స్‌లను బుధవారం మాదల రత్నగిరిబాబు, వికాస్ విద్యా సంస్థలు అధినేత శంకరావు, డాక్టర్ శివాజీ, డాక్టర్ రాజ, కార్పొరేటర్ వేములపల్లి శివరామకృష్ణప్రసాద్ సంయుక్తంగా ప్రారంభించారు. తాగునీటి కేంద్రం, బరువు యంత్రం, రైన్ షెల్టర్‌ను మాదల రత్నగిరిబాబు, మాదల చైతన్య, డాక్టర్ పాటిబండ్ల శివాజీ, డాక్టర్ మాదల పూజ, మాదల శ్రీరామ్‌భాస్కర్ సౌజన్యంతో నిర్మించారు. వాటికి సుమారు రూ.3.20 లక్షలు వెచ్చించారు. కార్యక్రమంలో తారకరామ్ ఎస్‌వీఎస్ కాలనీ పార్క్ సెంటర్ పార్క్ అధ్యక్షులు పాండ సారథి, కార్యదర్శి వేణు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాదల రత్నగిరిబాబు మాట్లాడుతూ పార్కుకు అవసరమైన వాటికి సహకరిస్తామని తెలిపారు. ఉద్యానవనం అభివృద్ధికి, పార్కులో గ్రంథాలయం ఏర్పాటుకు ఇతోధికంగా ఆర్థిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

శ్రేష్ట రైతు ఉత్పత్తిదారుల సంఘం భేష్

అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్



మాట్లాడుతున్న స్వప్నిల్ పవార్

తెనాలి: రైతులు సంఘటితంగా సంఘాన్ని ఏర్పాటు చేసుకుని సుస్థిర విధానాలతో వ్యవసాయం చేయటం, నాణ్యమైన పంటల ఉత్పత్తులను సాధించటం సంతోషంగా ఉందని గుంటూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్ అన్నారు. బుధవారం కొల్లిపర మండల గ్రామాల్లో ఆయన పర్యటించారు. రైతులు సాగు చేస్తున్న వివిధ రకాల పంటలను పరిశీలించారు. ముందుగా కొల్లిపరలోని శ్రేష్ట రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని ఆయన సందర్శించారు. కోల్డ్ స్టోరేజీని, కలెక్షన్ సెంటర్‌ను తిలకించారు. రైతులు పండించిన పసుపు, తదితర పంటలకు విలువ ఆధారిత (ప్రాసెసింగ్) ను జోడించటంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. శ్రేష్ట రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు, నిర్వహణను ఆయన అభినందించారు. మహారాష్ట్రలోని సహయాద్రి సంఘం అంతటి గుర్తింపును తెచ్చుకోవాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. సంఘంలోని రైతులు పసుపు పంట పొలాల్లో వినియోగిస్తున్న సాయిల్ సెన్సార్లను పరిశీలించి, పనితీరును తెలుసుకున్నారు. సంఘం రైతుల వద్ద శిక్షణ తీసుకుంటున్న విజ్ఞాన్ యూనివర్సిటీ, వ్యవసాయ కళాశాల విద్యార్థినులతో మాట్లాడారు. వ్యవసాయ రంగంలోనూ అపారమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. వారు నిర్వహిస్తున్న కార్యకకలాపాలను తెలుసుకున్నారు. సమీపంలోని చక్కెరకేళి అరటి, పసుపు పైర్లను పరిశీలించారు. వల్లభాపురంలో సేంద్రియ రైతు వంగా సాంబిరెడ్డి పండిస్తున్న కూరగాయల తోటను చూశారు. తిరిగి కొల్లిపరలో ప్రకృతి రైతు గురుమూర్తి పంట పొలానికి వెళ్లారు. అనుసరిస్తున్న విధానాలను తెలుసుకున్నారు. శ్రేష్ట రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ నెర్ల కుటుంబరెడ్డి, డైరెక్టర్లు వుయ్యూరు సాంబిరెడ్డి, బొంతు గోపాలరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉద్యాన అధికారి ఉషా పాల్గొన్నారు.

విశిష్ట వ్యక్తులకు వాగ్దేవి పురస్కారాలు ప్రదానం



పురస్కారాలు అందుకున్న ప్రముఖులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై రామరాజు ఫౌండేషన్, జి.వి.ఆర్. కల్చరల్ ఫౌండేషన్ సంయుక్తంగా తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా బుధవారం విశిష్ట వ్యక్తులకు వాగ్దేవి పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహించారు. సభకు రామరాజు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, అతిథులుగా మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, రంగస్థల నటుడు రచయిత డాక్టర్ నరాలశెట్టి రవి కుమార్, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, గవర్నమెంట్ ప్రింటింగ్ ప్రెస్ డెప్యూటీ డైరెక్టర్ డి.రవికుమార్, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ బి. మధుసూదనరావు పాల్గొన్నారు. జి.వి.ఆర్.కల్చరల్ ఫౌండేషన్ చైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి సంకలనం చేసిన కుటుంబం కవితా సంపుటిని అతిథులు ఆవిష్కరించారు. ప్రముఖ రంగస్థల నటుడు దర్శకుడు నూతలపాటి సాంబయ్య కవితా సంపుటికి స్వీకర్తగా వ్యవహరించారు. వయోలిన్ విద్వాంసులు పి.నందకుమార్, రంగస్థల నటి ఎం.సాయి ప్రియ, సబ్ ట్రెజరీ అధికారి జిత్తు మల్లికార్జునరావులను వాగ్దేవి పురస్కారంతో సత్కరించారు. సభానంతరం నవభారత్ దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కర్నాటి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పలువురు దివ్యాంగ కళాకారులు నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. సభను డి.తిరుమలేశ్వరరావు, సయ్యద్‌జానీబాషా, జి.మల్లికార్జునరావు పర్యవేక్షించారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు యత్నాలు విరమించాలి

తెనాలిఅర్బన్: స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రయత్నాన్ని ప్రభుత్వం వెంటనే విరమించాలని సీపీఎం తెనాలి కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. 2000 సంవత్సరంలో బాషీర్‌బాగ్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన అమరుల సంస్మరణ సభను చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆనాడు విద్యుత్ సంస్కరణలో పేరుతో ప్రైవేటీకరణకు చర్యలు తీసుకోవాడాన్ని నిరశిస్తూ పెద్దఎత్తున ఉద్యమం చేయటం జరిగిందని గుర్తు చేశారు. అప్పుడు జరిగిన పోలీసుల కాల్పులలో రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామిలు మరణించటం జరిగిందన్నారు. సీనియర్ నాయకులు ములకా శివసాంబిరెడ్డి, కె.రవి కుమార్, ఎస్.సుబ్రమణ్యం, పద్మ, కళావతి, కె.దుర్గ, గౌజియా, సునీత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ స్వర్ణ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమాల్లో భాగంగా బుధవారం విశేష అర్చన, హోమం, బలిహరణ, ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం కార్యక్రమాల్ని ఆలయ అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో టి. శ్రీనివాస్ పర్యవేక్షించారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ వద్దు

సమగ్ర శిక్ష ఏపీసీ జి. విజయలక్ష్మి



ప్రత్తిపాడు:మధ్యాహ్న భోజనం నాణ్యతలో ఏజెన్సీలు రాజీ ధోరణి అవలంబించవద్దని సమగ్ర శిక్ష ఏపీసీ జి. విజయలక్ష్మి చెప్పారు. మండల పరిధిలోని పాతమల్లాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు రాస్తున్న పరీక్షలను తరగతుల వారీగా పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఎంత మంది విద్యార్థులున్నారు? గైర్హాజరు ఎంత మంది ? అనే వివరాలను హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీసీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరుసగా రెండు రోజులు రాకపోతే తల్లిదండ్రులకు ఫోన్ చేసి కారణాలను అడిగి తెలుసుకోవాలని తెలిపారు. ఆమె వెంట ఎంఈవో సీహెచ్. రమాదేవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

ఎంఈఓ ప్రభాకర్ రావు

పొన్నెకల్లు(తాడికొండ): బడి బయట ఉన్న చిన్నారులందరీని పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ–2 ప్రభాకర్‌రావు సూచించారు. బుధవారం పొన్నెకల్లు ఎస్టీ కాలనీలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలలందరూ బడిలో ఉండాలి– విద్యా ప్రాముఖ్యంపై నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చదువు ద్వారానే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని, విద్య ద్వారా జ్ఞానం, నైపుణ్యం, ప్రతిభ పెంపొందించుకోవచ్చు కనుక ప్రతి ఒక్కరికీ చదువు అవసరం అన్నారు. పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతుంది కనుక విద్యార్థులు చిన్న వయసులో చదువుకు దూరం కాకుండా పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. నేడు చిన్న వయసులో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా చిన్నారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పొన్నెకల్లు సెక్టార్ ఐసీడీఎస్ సూపర్ వైజర్ కళావతి హెల్త్ సూపర్ వైజర్ జగదీష్, క్రాప్ జిల్లా కో ఆర్డినేటర్ జి.వెంకట్ పలువురు గ్రామస్తులు, చిన్నారులు పాల్గొన్నారు.